క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ దాసు

భీమవరం: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జి.దాసు, ఎస్సై నర్సింహారావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడమే గాక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ద్విచక్రవాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను వాయిదా వేయాలని నిరసన



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

భీమవరం: వాణిజ్య పన్నుల శాఖలో జరుగుతున్న బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలంటూ ఏపీసీటీ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సీఆర్‌యూ వ్యవస్థను రద్దు చేయాలని, రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా గతంలో జరిగిన బదిలీలను పునః సమీక్షించాలన్నారు. ఆర్ఓ వ్యవస్థను రద్దు చేసి, సర్కిల్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వి.రాజేష్ కుమార్, టి.రాజశేఖర్, ఎస్.సుధాకర్, వి.శైలజ పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా జాతీయ లోక అదాలత్‌ను విజయవంతం చేయాలని చెప్పారు.

నేడు కేవీకేలో అవగాహన సదస్సు

ఉండి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్స్యశాఖ, ఎంపెడా ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ఆక్వా రైతులు, డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అప్సడా, ఎంపెడా రిజిస్ట్రేషన్‌లు, ఆక్వా సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

పెనుగొండ: సిద్ధాంతంలో పురాతన విఘ్నేశ్వర స్వామి ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అభిషేకాలు, అర్చనలు అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వెండి యంత్రం, వెండి శిఖరాలను ఊరేగించారు . ఆలయ అర్చకులు వెలవలపల్లి జానకిరామయ్య శర్మ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.11 నిముషాలకు వెండి యంత్రం, వెండి శిఖర ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ వేడుకగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విఘ్నేశ్వర స్వామికి లక్ష గరిక పూజ నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డీఎన్నార్ కళాశాలలో జాబ్ మేళా



జాబ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ సహకారంతో సంధ్యా మెరైన్స్ కంపెనీ జాబ్ మేళా ఏర్పాటు చేసింది. ఈ మేళాలో 220 మంది విద్యార్థులు పాల్గొనగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి, బుద్ధరాజు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సంధ్యా మెరైన్స్ సంస్థ సభ్యులు ఏడుకొండలు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి



ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసే వైద్యులపైనే దాడులు దురదృష్టకరం. రాత్రి వేళల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటోంది. అందుకే రాత్రివేళ డ్యూటీ అంటేనే వైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. వైద్యులకు నిర్భయంగా సేవలందించే వాతావరణం కల్పించాలి. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలందుతాయి.

– జి.గణేష్, పిల్లల వైద్యుడు, నరసాపురం ఏరియా ఆసుపత్రి

చాలా భయమేస్తోంది



కోల్‌కతా ఘటన అనంతరం రాత్రిళ్ల ఆస్పత్రుల్లో డ్యూటీ చేయాలంటే భయమేస్తోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఒక్క ఆసుపత్రులు అనే కాదు మహిళలు పనిచేసే ప్రాంతాల్లో వారికి కనీస సౌకర్యాలు, భద్రత కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరం చేసిన వారికి కఠిన శిక్షలు ఉండేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో నిఘా వ్యవస్థ పటిష్ట పరచాలి. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– బి.గరిమా, పెథాలజిస్ట్, నరసాపురం ఏరియా ఆసుపత్రి

ఫలిస్తున్న జగనన్న ఆలోచనలు

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు
- ట్యాబ్స్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు
- విద్యావ్యవస్థలో అద్భుత అధ్యాయమంటున్న తల్లిదండ్రులు

ఉండి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన హయాంలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు నాంది పలికారు. ఆయన తీసుకున్న నిర్ణయాలు నేడు ఫలిస్తున్నాయి. నాడు నేడు పథకం ద్వారా పాఠశాల భవనాల రూపురేఖలను కార్పొరేట్ భవనాలకు దీటుగా మార్పు చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. మధ్యాహ్న భోజనం మెనూను స్వయంగా ప్రకటించి అమలు చేశారు. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేశారు. ఇంగ్లిషు మీడియం చదవులకు నాంది పలికడంతోనే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కిటకిటలాడాయి. కొన్ని పాఠశాలల్లో సీట్లు ఖాళీలేవనే బోర్డులు కూడా దర్శనమిచ్చాయి. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేశారు. మండలానికి ఒకటి లేదా రెండు హైస్కూల్స్‌ను ఎంపిక చేసి, ఆయా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు సీబీఎస్‌సీ స్థాయిని పరీక్షించేందుకు ఇటీవల టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిస్తే మరింత ముందుకెళ్లే అవకావం లభిస్తుంది. జాతీయస్థాయిలో పోటీపడే అవకాశాలు మెండుగా లభిస్తాయి. ఈ పరీక్షలను ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఇందతా జగన్ ఘనతేనని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉండి జెడ్పీ హైస్కూల్‌లో ట్యాబ్స్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

సంతోషంగా ఉంది



పెన్ను పుస్తకాలు, పేపర్లలో కాకుండా ట్యాబ్‌లో పరీక్ష పేపర్ రావడం, దానిని చూస్తూ వారి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయడం చాలా సంతోషంగా ఉంది. పెద్దపెద్ద డబ్బున్న వాళ్లు చదవుకునే స్కూల్స్‌లోనే ఇటువంటి సదుపాయాలు ఉండేవి. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి సదుపాయాలు కల్పించడం గొప్ప మార్పు.

– గోడి రిషి, టెస్ట్ విద్యార్థి, జెడ్పీ హైస్కూల్ ఉండి

ఏదైనా సాధించగలననే ధీమా



మాకు లభించిన ట్యాబ్‌ల ద్వారా చాలా కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. ఇందులో ఉన్న డేటా ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకోవడం ద్వారా మా చదవులు మరింత సులభంగా మారిపోతున్నాయి. ఇప్పుడు సీబీఎస్‌సీ పరీక్షలను ట్యాబ్‌లలో రాయడంతో పెద్దపెద్ద చదువులు చదవాలనే కోరిక పుడుతోంది.

– ఆలమూరి అఖిల్, ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ విద్యార్థి

అద్భుతాలు చేశారు



ప్రభుత్వ విద్యావ్యవస్థలో జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతాలే చేశారు. పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూస్‌తో సహా అన్నీ ఉచితంగా ఇవ్వడంతో ఇంగ్లిషు మీడియం చదువులతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. మధ్యాహ్న భోజనం, నాడు నేడు పథకంతో కార్పొరేట్ స్థాయిని తీసుకొచ్చారు. విద్యార్థులకు అమోఘమైన కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించి ప్రభుత్వ విద్యావ్యవస్థను మరో మెట్టు ఎక్కించారు.

– బందెల ప్రమీల, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాళ్ల: మత్తు పదార్థాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఆకివీడు సీఐ జగదీశ్వరరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని హెచ్చరించారు. సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

కాళ్ల: వ్యక్తిని కొట్టి గాయపరిచిన ఘటనపై కాళ్ల పోలీస్ స్టేషన్లో మంగళవారం కేసు నమోదైంది. దొడ్డనపూడి గ్రామానికి చెందిన పి.శ్రీనివాసరావు, ఏసుబాబు కాళ్ల కొత్త కాలనీ వద్ద బడ్డీ కొట్టులో సిగరెట్ కొంటుండగా బొట్టా పవన్ అనే వ్యక్తి పాత గొడవల నేపథ్యంలో కులం పేరుతో దూషిస్తూ దాడి చేశాడు. గాయాలు పాలైన ఏసుబాబుని తన సోదరుడు 108 వాహనంలో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. బాధితుడి ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని కాళ్ల ఎస్సై ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

సెల్ ఫోన్ చోరీకి యత్నం

భీమవరం: పట్టణంలోని వీరమ్మపార్కు వద్ద నడిచి వెళుతున్న ఆకివీడుకు చెందిన ఎం.అప్పారావును మాటల్లో పెట్టి ఎం.మహేష్ సెల్ ఫోన్ దొంగలించడానికి యత్నించడని పోలీసులు తెలిపారు. అడ్రస్ అడిగి వివరాలు చెప్పే సమయంలో అప్పారావు జేబులోని సెల్‌ఫోన్‌ను మహేష్ తీసుకుని పారిపోతుండగా వెంటపడి అడ్డుకోగా బ్లేడుతో దాడి చేయబోయాడు. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

పాలకోడేరు : మండలంలోని గొరగనమూడి పెదపేటకు చెందిన తులసి అవినాష్ (17) అనే యువకుడు ఈ నెల 26న అదృశ్యమైనట్టు ఎస్సై ఎస్ హరిబాబు మంగళవారం తెలిపారు. యువకుడు తండ్రి తులసి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని వివరించారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి



ఓటర్ లిస్టు తనిఖీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: ఓటర్ల నమోదును పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ఏవి రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలంలో నిర్వహిస్తున్న ఓటర్ లిస్టు తనిఖీ డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయకుదురులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ లిస్టులో ఉన్న వివరాలను సరి చూసుకునే విధంగా ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల పూర్తిస్థాయి వివరాలను సరి చూసుకోవాలన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ నూజివీడు వీఆర్వో మోహన్ రావు వెంకట్రావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కలుషితమవుతున్న పంట కాలువ నీరు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ మంగళవారం సందర్శించారు. గ్రామంలోని మురుగు డ్రెయిన్లు, పంట కాలువను పరిశీలించారు. అనంతరం ఆకివీడు నుంచి గ్రామానికి వచ్చే పంట కాలువను పరిశీలించారు. గ్రామంలో గత 20 రోజులుగా వైరల్ ఫీవర్లు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం విదితమే. పంట కాలువలో నీరు కలుషితమవుతోందని గుర్తించినట్టు చెప్పారు. అయిభీమవరం రోడ్డు నుంచి పంట కాలువలోని నీరు గ్రామంలోని మంచినీటి చెరువులోకి వస్తున్నాయన్నారు. ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్‌కు ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేసి, ఆక్రమణల్ని తొలగించాలని సూచించామని తెలిపారు.

వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో వైష్ణవ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం సాయంత్రం సంప్రోక్షణ అనంతరం దేవాలయం తెరిచి భక్తులకుస్వామి వారి దర్శనం కల్పించారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారికి విశేష పూజా కార్యక్రమం అనంతరం 12 రకాల ప్రసాదాలతో నివేదన సమర్పించారు. నీరాజన మంత్రపుష్పాలతో భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కృష్ణాష్టమి సంబరాలు

ఉండి: ఉండి సెంటర్‌లోని శ్రీరామక్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజు మంగళవారం మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని ఉట్టి కొట్టారు. కృష్ణ భగవానునికి పూజలు చేశారు. భక్తులకు జన్మాష్టమి ప్రత్యేకత, శ్రీకృష్ణుని లీలలపై అధ్యాత్మిక ప్రసంగాలను వినిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను నిర్వాహకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుండాబత్తుల సుబ్బారావు, ఆనంద్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవారు



ఉండి శ్రీరామక్షేత్రంలో పూజలు అందుకున్న కృష్ణభగవానుడు

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కాళ్ల: ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ పి.ఆంజనేయరాజు సూచించారు. కాళ్ల సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. కాళ్ల మండలంలో ఇప్పటివరకు నిర్మాణ దశలో ఉన్న 198 గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమును క్లోజ్ చేసే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్లలో ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ఉప సర్పంచ్ పన్నాసి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విల్సన్, పుప్పాల బుజ్జి, బండారు సోమేశ్వరరావు, మొగళ్ల షావుకారు, హౌసింగ్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ ఆంజనేయరాజు

డీఎన్నార్‌లో ద్విచక్రవాహనాల అమరికపై శిక్షణ

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్విచక్ర వాహనభాగాలను అమర్చడం, విడతీయడం అనే అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యమహా షోరూమ్ సర్వీస్ మేనేజర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ వాహనాల్లోని ముఖ్యమైన భాగాలు, వాటి విధులు, సాధారణ సమస్యల పరిష్కారంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంజిన్‌లోని లోపాలను గుర్తించడం, ఇంజిన్ అమర్చేటపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. అలాగే అసెంబ్లింగ్ చేసేటప్పుడు ప్యాకింగ్ సెట్, ఇంజిన్ ఆయిల్ ఉపయోగించే విధానం, ఫోర్ స్ట్రోక్ ఇంజిన్ హెడ్ సమగ్ర పరిశీలన, వాల్వ్ టైమింగ్ సెట్టింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, మెకానికల్ హెచ్ఓడి ఐ.హరీష్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం డీఎన్నార్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

పోలీసు సిబ్బందికి ఉచిత రక్త పరీక్షలు

భీమవరం: పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలరని నిత్యం ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. మంగళవారం సీఐ కాళీచరణ్ ప్రోత్సాహంతో టుటౌన్ పోలీసు సిబ్బందికి ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కాళీచరన్ మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటారని ఇలాంటి సమయంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పని ఒత్తిడిలో పడి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపరనే ఉద్దేశంతో తానే చొరవ తీసుకుని రక్తపరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. రక్త పరీక్షలు రిపోర్టులు ఆధారంగా వైద్యులను సంప్రదించి వైద్య సహాయం అందించడానికి కృషిచేస్తామని కాళీచరణ్ చెప్పారు.



భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో రక్తం సేకరిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సేవా సంస్థలు, ఫౌండేషన్‌ల ద్వారా అనేక సహాయ సహకారాలు అందుతాయని అద్దేపల్లి గంగరాజు సత్రం సభ్యులు ఆచారి అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో దేవదాయ ధర్మాదాయ శాఖ అద్దేపల్లి గంగరాజు సత్రం, అద్దేపల్లి మోహన్‌దాస్ ఫౌండర్ అండ్ ఫ్యామిలీ చైర్మన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ అద్దేపల్లి గంగరాజు సత్రం ద్వారా విద్యార్థులకు ఉచిత భోజనం, పుస్తకాలు, ఉచిత హోమియో మందులు మహిళలకు దుస్తులు వంటివి అందజేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

బాలికల ఎదుగుదలపై శ్రద్ధ అవసరం

ఉండి: కిశోర బాలికల ఎదుగుదలపై ప్రతి తల్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. మంగళవారం మహదేవపట్నంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఆడబిడ్డ ఎదిగే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించాలన్నారు. మంచి చదవులు చదివించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఆడబిడ్డకు ఎన్నో ఇబ్బందులు ఏర్పడతాయని, బాల్య వివాహాలు నేరమని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, పలువురు తల్లులు పాల్గొన్నారు.



మహదేవపట్నంలో మాట్లాడుతున్న నిర్మల

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, వారికి సహకరించినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మి, భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహ నిరోధక, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి, లక్ష్మీకాంతం మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 వయస్సు దాటాకే వివాహం చేయాలన్నారు. చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల తల్లి, బిడ్డకు ప్రమాదాలు జరుగుతాయన్నారు. వారి మెదడు పరిపక్వత చెందకపోవడంతో జీవితంలో సమస్యలు ఎదుర్కొనలేరని దీంతో ఆత్మనూన్యత భావాలకు లోనై దంపతుల జీవితాల్లో గొడవలకు ఆస్కారం కలుగుతుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై విధిగా అవగాహన కల్పించాలన్నారు. మహిళల అసభ్యంగా ప్రవర్తించినా, వారిపై అత్యాచారాలు, దాడులు చేసినా చట్టపరంగా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అనంతరం గర్ల్స్‌లో ఉన్న తల్లుల పిల్లల సంరక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం–2006, పోక్సో చట్టం –2012, వన్‌స్టాఫ్‌సెంటర్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్, వీఆర్‌వోలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం

ఆక్వా అనుమతులపై అవగాహన

పెనుమంట్ర: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మత్స్యశాఖ, ఎంపెడా వారి సంయుక్త ఆధ్వర్యంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ ఎల్ఎన్ రాజు మాట్లాడుతూ అప్సడా అనుమతులు తప్పనిసరి, అనుమతులు లేని ఆక్వా రైతులు త్వరితగతిన అనుమతులు పొందాలన్నారు. ఎంపెడా ఏడీ ఆనందరావు మాట్లాడుతూ మన జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం ఎంపెడా వద్ద నమోదు చేసుకోవాలని, ధరల ఆటుపోట్లు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని సాగు చేయాలని తెలిపారు. ఆక్వా రైతులకు 10 ఎకరాలకు మించిన వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింపు జరిగేలా చూడాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడా శ్రీనివాస్ ఉన్నారు.

కరెంటు కోతతో ప్రజల ఇక్కట్లు

పెనుగొండ: పెనుగొండలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. పెనుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సాంకేతిక సమస్య తలేత్తడంతో ఉదయం 10 గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. వేసవి తలపించే ఉక్కబోతలు ఉండడంతో, దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు పడ్డారు. తాడేపల్లి గూడెం నుంచి పరికరాలు తీసుకువచ్చి మరమ్మతులు చేసినా రాత్రి వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతూనే ఉంది. రావడం, నిలిచిపోవడం జరుగుతుండడంతో ఇబ్బందులు పడ్డారు. గత వారం మార్టేరు పరిసర ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి ఎదురుకావడంతో రెండు రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖాధికారులు సైతం నానావస్థలు పడ్డారు. సాయంత్రానికే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.